## మిడ్ మానేరు నుంచి రంగనాయక్‌సాగర్‌కు నీటిని విడుదల చేయండి

### నీటిపారుదల శాఖ మంత్రికి ఫోన్‌లో విన్నవించిన మాజీ మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట నియోజకవర్గంలో పంట పొలాలకు సాగు నీరు అందక ఎండిపోతున్నాయని మిడ్ మానేరు నుండి రంగనాయక్ సాగర్‌లోకి 1 టిఎంసి నీటిని ఎత్తిపోయాలని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫోన్‌లో మాట్లాడారు శనివారం రోజున మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు. ఈ సందర్భంగా నియోజగవర్గంలో గత నాలుగేళ్లుగా యాసంగి పంట కోసం రంగనాయక్ సాగర్ కాల్వల ద్వార రైతుల పంట పొలాలలకు సాగునీటిని అందిస్తున్నామని, ఈ యేట యాసంగి పంటకాలం పూర్తయే వరకు సాగునీటిని అందించాలని రైతుల పక్షాన ఫోన్‌ద్వార కోరారు. రంగనాయక్ సాగర్ ద్వార ప్రతీ ఏటా రైతులకు మంచి పంట రాబడి పెరుగుతుందని ఈ యేట 50వేల ఎకరాల పంట ఉందన్నారు. ఇటీవల రంగనాయక్ సాగర్‌లో 2.4 టిఎంసిల నీటిని పంపింగ్ చేయగా ప్రస్తుతం 1.5 టిఎంసిలు మాత్రమే ఉందని యాసంగి పంటసాగుకు మరో టిఎంసి నీరు అవసరం పడుతుందని కావున మిడ్‌మానేరు ద్వార నీటిని విడుదల ఇరిగేషన్ అధికారులకు ఆదేశించాలని వివరించారు.




## ఎంపి, ఎమ్మెల్యేల సహకారంతో సిసి రోడ్లు

### బిజెపి మండల అధ్యక్షుడు ఈర్ల రాజు

అమీన్‌పూర్, మార్చి1 ప్రభాతవార్త: మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిల సహకారంతో సీసీ రోడ్లు వేయడం జరుగుతుందని అమీన్‌పూర్ మండల బీజేపీ అధ్యక్షులు ఈర్ల రాజు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఈర్ల రాజు దగ్గరుండి సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్ గూడలో గతంలో రోడ్లకు సంబంధించి ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లడంతో ఎంపీ స్వయంగా పటేల్ గూడలో పర్యటించి రోడ్లను పరిశీలించారని, అనంతరం మున్సిపల్ ఉన్నతాధికారులకు, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డికి, మాజీ వైస్ చైర్మన్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్‌లోతో మాట్లాడి వెంటనే నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పటేల్ గూడ ప్రజల తరపున ఎంపీ రఘునందన్ రావుకు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిలకు, మున్సిపల్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఎంఎన్ఆర్ ఈజీఎస్‌లో చేపట్టిన సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మర్లుగుదొడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీ భవనాలు తదితర నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరని పిఆర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం పిఆర్, వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. పూర్తిచేసిన నిర్మాణ పనుల ఎంబి రికార్డు చేయాలన్నారు. మిగిలిపోయినా నిర్మాణ పనులను ప్రారంభించి వెంటనే నిర్మాణ పనులుచేపట్టి ప్రగతిని చూపించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, పిఆర్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## దేశానికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం అవసరం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 1, ప్రభాతవార్త :** సంగారెడ్డి నియోజక వర్గం కంది శివారులోని ఐఐటి హైదరాబాద్‌లో శనివారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐఐటీ హెచ్‌లో ఏర్పాటు చేసిన సైన్సు ఎగ్జిబిషన్‌ను ఐఐటీ డైరెక్టర్ వీఎస్ మూర్తితోకలిసి కలెక్టర్ తిలకించారు. విద్యార్థులు చేసిన పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, విజ్ఞాన వ్యవసాయ ఉత్పత్తుల, తరిగిపోయే, తరిగిపోనీ ఇంధన వనరుల గురించి చేసిన ప్రాజెక్టులు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి కాలంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

### టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ సాయిబాబా

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**


మాట్లాడుతున్న టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సాయిబాబా

వేసవి కాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సాయిబాబా అన్నారు. శనివారం టీజీఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీఫరూకి విద్యుత్‌శాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో వేసవి కాలంలో నిరంతర విద్యుత్‌పై తగు ఆదేశాలను జారీ చేశారు. సిద్దిపేట పట్టణంలోని జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యుత్‌శాఖ డైరెక్టర్ సాయిబాబా మాట్లాడుతూ టీజీఎస్ పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ అలీఫరూకి ఆదేశాల మేరకు రైతాంగానికి విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క వినియోగాదారునికి నిరంతరం 24 గంటల విద్యుత్‌ను అందించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తుతే వెంటనే ఆ ప్రాంత విద్యుత్ అధికారి దృష్టికి తేవాలన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి విద్యుత్ సమస్య తలెత్తకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా అధికారి చంద్రమోహన్, డివిజన్ ఇంజనీర్లు రామచంద్రయ్య, సుధీర్, భిక్షపతి, విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

### కేసు నమోదు

**అక్కన్నపేట, మార్చి 1, ప్రభాతవార్త :** అక్కన్నపేట పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించిన వ్యక్తిపై ఎస్ఐ విజయ్‌భాస్కర్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని బంగారులొద్దితండాకు చెందిన దరావత్ సంపత్(32) అదే గ్రామానికి చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని నాలుగు సంవత్సరాలుగా సహజీవనం చేసి తనపైనే ఫిర్యాదు చేసిందని కేసుల పాలై జైలుకు పోతాడనే భయంతో బాటిల్‌లో పెట్రోల్ పోసుకుని పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన విధినిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి, యాదగిరి చాకచక్యంగా వ్యవహరించి ఆత్మహత్యాయత్నాన్ని ఆపారని ఎస్ఐ తెలిపారు. పోలీస్ స్టేషన్ ముందు ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.


పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్య యత్నానికి ప్రయత్నిస్తున్న సంపత్


ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి


అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్

## ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**కంది, మార్చి 1, ప్రభాతవార్త:**

భారత ఉప రాష్ట్రపతి జగదీష్ ధనకర్ ఈ నెల 2న తేదీన కందిలో పర్యటించనున్న సందర్భాన్ని పురస్కరించు కుని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. కంది ఐఐటిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, సమావేశ స్థలాన్ని కలెక్టర్ క్రాంతి వల్లూరు ఐఐటీ డైరెక్టర్ బివిఎస్ మూర్తితో కలిసి పరిశీలించారు. ఉపరాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి సమస్యలు తలెత్తకూడదని ఆయా శాఖల అధికారులు సమన్వయంత పనులు చేయాలని కలెక్టర్ ఆదే శించారు. ప్రోటోకాల్‌ను విధిగా పాటించాలన్నారు. వీఐపి పార్కింగ్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, ఐడి కార్డుల పంపిణి తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని, అగ్ని మాపక యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, అంబులెన్స్‌లో అత్యవసర వైద్య స్బిబ్బంది అదుబాటులో ఉండాలని విద్యుత్, అగ్ని మాపక, వైద్యాధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, డిఎస్‌పి సత్తయ్య గౌడ్ ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, డిపిఓ సాయిబాబా, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

### 550 మంది పోలీసులతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్

**సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 1 ప్రభాతవార్త :** భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ ఆదివారం ఐఐటి హైదరాబాద్ పర్యటన సందర్భంగా 550 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఐఐటి హైదరాబాద్‌లో బందోబస్తుకు వచ్చిన అధికారులతో ఏర్పాటుచేసిన బ్రీఫింగ్ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఆదివారం భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్ ఐఐటిహైదరాబాద్ పర్యటన సందర్భంగా సంగారెడ్డి జిల్లా సివిల్, సాయుధ బలగాలు, బాంబ్ డిస్పోజల్ టీమ్స్ మొత్తం సుమారు 550 మంది పోలీసులతో మూడంచెల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. కాంపస్ విద్యార్థులు తప్పనిసరిగా ఐడి తీసుకొనిరావాలని సూచించారు. ఐఐటి కాంపస్ నుండి 5 కి.మీ వరకు డ్రోన్ లను ఎగురవేయడం నిషేధించడం జరిగిందని, ఎవరైన డ్రోన్ లను ఎగురవేసినట్లైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ ఎ. సంజీవ రావ్, డియస్పీ లు సత్యయ్య గౌడ్, రవీందర్ రెడ్డి రామ్ మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి మరియు జిల్లా ఇన్‌స్పెక్టర్లు సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని భ్రష్టుపట్టిస్తున్న నర్సారెడ్డి

**-గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి తొలగించాలి**

**-టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి**

**గజ్వేల్, మార్చి 1(ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి విమర్శించారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని కోల అభిరాం గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009లో టిడిపి నుంచి నర్సా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరానని, అప్పటి నుంచి కాంగ్రెస్ బలోపేతానికి పనిచేశానన్నారు. 2014లో కాంగ్రెస్‌నుండి బిఆర్ఎస్ పార్టీలోకి నర్సా రెడ్డి అమ్ముడుపోయారని, ఆ పార్టీతో బేరం కుదుర్చుకొని నియోజకవర్గంలోని పలు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్‌లను బిఆర్ఎస్‌లోకి వెళ్లే విధంగా చేశారని, అలాంటి వ్యక్తి మమ్మల్ని కోవర్టు రాజకీయాలు చేస్తున్నామని అనడం సరైందికాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో నీలం మధు ఇచ్చిన డబ్బులు పక్కన పెట్టుకుని మేము పెట్టిన డబ్బులతో ప్రచారం చేశావని, నీలం మధుకు మద్దతుగా తూంకుంట నర్సా రెడ్డి ఏ ఒక్క గ్రామంలో ప్రచారం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం నర్సా రెడ్డిని నమ్ముకున్నందుకు ఆస్తులు అమ్ముకొని పోటీచేశామన్నారు. నర్సా రెడ్డి ఎన్నికల ప్రచారానికి వెళ్తే తిట్టనోళ్లు లేరన్నారు. ఎవరి వద్ద ఎంత డబ్బులు తీసుకున్నావో మాదగ్గర ఆధారాలు ఉన్నాయని, నీ ఆటలన్నీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌కు వివరిస్తామ న్నారు. గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న కేడర్ ఎక్కడా లేదు, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మనదే అన్నారు. కాం గ్రెస్ పార్టీ బలోపేతానికి సిఎం రేవంత్‌రెడ్డి, బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో పనిచేస్తామన్నారు.


మాట్లాడుతున్న నాయిని యాదగిరి

### పదవి ఇప్పిస్తానని మోసం చేశారు

**-మనోహరాబాద్ మండల అధ్యక్షుడు జూపల్లి మల్లారెడ్డి**

నర్సా రెడ్డి పిలవగానే వెంటనే వాలిపోయే కరుడు గట్టిన కాంగ్రెస్ కార్యకర్తను అయిన నన్నే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇప్పిస్తానని మోసం చేశారని మనోహరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూపల్లి మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో నర్సా రెడ్డి ఉంటే పార్టీకి తీవ్ర నష్టం కలుగు తుందని, పది నెలలు గజ్వేల్ నియోజకవర్గంలో నర్సా రెడ్డి లేకుంటే పార్టీ కోసం ఎంతో కష్టపడి తిరిగామని, నాకు పదవి వద్దన్నా పదవి ఇస్తానని మాట ఇచ్చి మోసం చేశాడని అన్నారు. పదవి కోసం నావద్ద ఎకరం భూమి, రూ.30లక్షల నగదు ఇచ్చానని అన్నారు. ఎప్పుడు ఏ కార్యక్రమం జరిగినా తన జేబు నుండే డబ్బులు పెట్టేవాడినని, ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా ముందుండి సహాయం చేసేవాడినని, కార్యకర్తలు చనిపోతే నర్సా రెడ్డి ఏ ఒక్కరికి ఆర్థిక సహాయం అందించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు ఉన్నారని అనే అర్హత నర్సా రెడ్డికి లేదన్నారు. ఎకరం భూమి తీసుకొని మార్కెట్ చైర్మన్ పదవి ఇప్పిస్తానని మోసం చేసిన ఘనుడు నర్సా రెడ్డి అన్నారు. నా తప్పు ఉంటే నేను కాళ్ల మొక్కి వెళ్లిపోతానని, లక్షలు లక్షలు తీసుకొని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను మోసం చేయడం సరైందికాదన్నారు. ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ నర్సా రెడ్డి హటావో కాంగ్రెస్ బచావో అనే వ్యక్తులకు ఈ రోజు కాంగ్రెస్‌లో స్థానం ఇచ్చిన ఘనుడు నర్సా రెడ్డి అన్నారు. గజ్వేల్ కాంగ్రెస్ పార్టీలో కొత్త వ్యక్తులు తప్ప గతంలో కష్టపడిన ఏ నాయకుడు ఆయనకు కనిపించలేదన్నారు. నామినేటెడ్ పదవుల కోసం డబ్బులు వసూలు చేస్తూ కాలం గడుపుతున్నారని, గజ్వేల్ కాంగ్రెస్‌పై అధిష్టానం దృష్టి సారించాలన్నారు. అనంతరం గజ్వేల్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ నర్సా రెడ్డి మమ్మల్ని ఉద్దేశించి కోవర్టులని అంటే ఊరుకునేదిలేదని, నర్సా రెడ్డి పదినెలలు గజ్వేల్‌లో కనిపించకున్నా మండల పరిధిలో కాంగ్రెస్ జెండా మోసానని అన్నారు. మాకు నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా పార్టీకి ఏ మాత్రం కష్టపడని వారికి డబ్బులు తీసుకొని పదవులు కట్టబెట్టడం మంచి పద్దతి కాదన్నారు. పార్టీ ఆదేశాలను గీత దాటుతున్న నర్సా రెడ్డిని నియోజకవర్గ ఇంచార్జ్ నుండి తొలగించాలని, పార్టీలో పనిచేసే వారికి న్యాయం జరిగేలా చూడాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోపాల్‌రావు, రాజు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, విజయ్, బాబా, అనిల్, మామిడి కృష్ణ, సూరజ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ అవినీతిలో మండల వ్యవసాయాధికారి సస్పెన్షన్

- * పాత్ర దారి సంగతి సరే...మరి సూత్రదారుల సంగతేంటో...!? * మార్కెట్ కమిటీ పాలకవర్గం..అధికారులపై చర్యలు ఉండవా...!?
- * అవినీతి సొమ్మును మళ్లీ రికవరీ చేస్తారా లేదా...!? * పక్కదారి పట్టిన పత్తి రెండు మిల్లులకే వెళ్లిందా...!

**హుస్నాబాద్ రూరల్, మార్చి 1, ప్రభాతవార్త :**

హుస్నాబాద్ మార్కెట్ కమిటీలో ఏర్పాటుచేసిన సిసిఐ పత్తి కొనుగోలు వ్యవహారంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, అధికారులు కుమ్మక్కై కొద్ది రోజుల క్రితం పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని విమర్శలురావడంతో ప్రభాతవార్తలో "హుస్నాబాద్ మార్కెట్ కమిటీలో ఫోర్జరీ సంతకాల గోల" శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. అయితే వార్త వెలుగులోకిరాగానే జిల్లా వ్యవసాయ అధికారి రాధిక మార్కెట్ కమిటీలో రైతుల నుండి

**'వార్త' ఎఫెక్ట్**

కొనుగోళ్లు చేసిన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి అందులో 18 టోకెన్ల ద్వార 940 కిలోలకు పైగా పత్తిని మండల వ్యవసాయ అధికారి సంబంధిత ఏఈవోలకు తెలియకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేశారని గుర్తించి ఉన్నత అధికారులకు నివేదిక పంపించడంతో ఏవో నాగరాజును శుక్రవారం రాత్రి వ్యవసాయశాఖ కమిషనర్ గోపి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడివరకూ బాగానే ఉన్నా ఈ ఫోర్జరీకి సంబంధించిన విషయంలో సంబంధిత అధికారి మార్కెట్ కమిటీ పాలకవర్గంతో కుమ్మక్కయ్యారని ఈ విషయంలో ఒక కోటి రూపాయల వరకు ప్రజాధనం పక్కదారి పట్టగా అందులో మార్కెట్ కమిటీ పాలకవర్గం,




అధికారులు ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు రూ.40 లక్షలకు బేరం మాట్లాడుకుని అందులో 10 లక్షల రూపాయలు తీసుకున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తోంది. ఈ అవినీతి వ్యవహారంలో పాత్రదారుడైన మండల వ్యవసాయశాఖ అధికారిని సస్పెండ్ చేసిన అధికారులు మార్కెట్ కమిటీ అధికారులు, పాలకవర్గంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అవినీతి వ్యవహారం స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి వెళ్లగా అధికారులు, పాలకవర్గంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సైతం వినిపిస్తోంది. ఎమ్మెల్యేగా, మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకొస్తున్న తరుణంలో అధికారులు, నేతల తీరుతో మంత్రి ప్రతిష్టకు భంగం కలిగే అవకాశాలు లేకపోలేదు. ఏదిఏమైనా ఈ అవినీతి వ్యవహారంలో పాత్రదారిపై చర్యలు తీసుకున్న అధికారులు సూత్రదారులపైనా చర్యలు తీసుకుంటారా లేదా అనే విషయంపై ప్రజలు, రైతులు, మేదావులు సందిగ్ధంలో ఉన్నారు. వ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకున్న విధంగానే మిగతా సూత్రదారులపైనా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు ఏ విధంగా వ్యవహరిస్తారో వేచిచూడాల్సిన అవసరం ఉండగా అవినీతి జరిగిన సొమ్మును మళ్లీ అధికారులు రికవరీ చేస్తారా లేదా ఇలాగే వొదిలేస్తారే అనే విమర్శలు ఉన్నాయి. అయితే 18 టోకెన్ల ద్వారా విక్రయించిన 940 క్వింటాళ్లకుపైగా పత్తిని ఈ ప్రాంతంలోని రెండు మిల్లులకే వెళ్లిందని ఈ వ్యవహారంలో ఆ రెండు జిన్నింగ్ మిల్లుల యాజ మాన్యాల పాత్ర ఉన్నట్లు స్పష్టంగా అర్థమౌతున్న తరుణంలో హుస్నాబాద్‌లో ఉన్న అన్ని మిల్లులపై అధికారులు దాడులు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

## ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు : మాజీ మంత్రి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవప్రార్థనలతో సామరస్యం, ఆనందం ప్రతీ ఒక్కరి జీవితంలో వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతీ ముస్లిం కూడా సేవా దృక్పదానికి, సహనానికి ప్రతీకగా ఈ పండగ నిర్వహించుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ప్రతీ ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## హరీష్‌రావుపై అక్రమ కేసులు తగవు

**-రాష్ట్ర రైతుబంధు సమితి కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవి రవీందర్**

**గజ్వేల్, మార్చి 1 (ప్రభాతవార్త):** ప్రజల పక్షాన పోరాడుతున్న తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి హరీష్‌రావుపై అక్రమ కేసులు బనాయించడం తగదని రాష్ట్ర రైతుబంధు సమితి కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవి రవీందర్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బ్రోకర్ రాజకీయాలకు పేరు గడించిన కాంగ్రెస్ నేతగా చెప్పుకుంటున్న చక్రధర్‌గౌడ్‌తో అక్రమ కేసులు పెట్టించింది కాంగ్రెస్ నేతలే అన్నారు. నరపజల పక్షాన అహర్నిశలు పోరాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు మీద కక్షపూరిత రాజకీయాలకు తెరలేపుతూ సిఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. బ్రోకర్ కేసులతో జైలుకు వెళ్లి క్యారెక్టర్‌లేని చక్రధర్‌గౌడ్ కేసు పెట్టగానే పోలీసులు ఎఫ్ఐఆర్ బుక్ చేయడం దీనికి పరాకాష్ట అన్నారు. ఇటీవల కెటిఆర్, కవిత, బిఆర్ఎస్ నేతలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వాటిని అధిగమించి ప్రజల ముందు దోషులు ఎవరో నిర్దోషులు ఎవరో తేలిపోయిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో గతంలో అసలైన ప్రజాపాలన అందించారన్నారు. ఇటువంటి చిల్లర రాజకీయాలు బిఆర్ఎస్ పార్టీకి అవసరంలేదన్నారు. ప్రజలకు ఏది అవసరమో అవి అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ బిఆర్ఎస్ పార్టీ పాలన సాగించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయక ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను చూసి తట్టుకోలేక రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని లేకుంటే ప్రజా క్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల రమేష్‌గౌడ్, నిజామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవి రవీందర్


ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

## చికిత్స పొందుతూ మహిళ మృతి

### ఆసుపత్రి ఎదుట కుటుంబీకులు ఆందోళన

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 1, ప్రభాతవార్త :** సంగారెడ్డిలోని చౌరస్తా సమీపంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన మహిళ మృతి చెందడంతో మృతురాలి బంధువులు గ్రామస్తులు శనివారం నాడు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి అధికారులతో తీవ్ర వాగ్వివాదానికి దిగారు. మృతురాలి కుటుంబీకులు ఆందోళన చెప్పడంతో పరిస్థితి కొద్దిసేపు ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం మదిరి గ్రామానికి చెందిన మహానంది అనే మహిళ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి రాగా చికిత్స చేసిన వైద్యులు మహిళా మృతి చెందిందని సమాచారం ఇచ్చారని మృతురాలి బంధువులు తెలిపారు.

### చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు



**బెజ్జంకి, మార్చి 1,ప్రభాతవార్త :** కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటన శనివారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో గల రాజీవ్‌రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌కుచెందిన కిరణ్, శ్రీనివాస్ పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి కరీంనగర్‌కు వెళు తున్న క్రమంలో తోటపల్లి రాజీవ్ రహదారి బస్టాప్‌కు సమీపంలోకి రాగానే కారు నడుపుతున్న వ్యక్తి నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలవగా స్థానికులు వెంటనే స్పందించి ఇరువురుని అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులు... అరెస్టు

**చేర్యాల, మార్చి 1, ప్రభాతవార్త :**

గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టుచేశారు. శనివారం చేర్యాల పోలీస్ స్టేషన్‌లో సిఐ శ్రీను,ఎస్సై నిరేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. చేర్యాల పట్టణానికి చెందిన నీలం చందు, బచ్చన్నపేటకు చెందిన ఏనుగుల బాబు, మహంకాళి రాజేశ్‌లు ముగ్గురు శనివారం ఉదయం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ వెనుక భాగాన గంజాయి విక్రయిస్తూ, తాగుతున్నారని నమ్మదగిన సమాచారం అందడంతో సిద్దిపేట జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు, చేర్యాల పోలీసులు వెళ్ళి దాడులు నిర్వహించగా నిందితులు గంజాయి పడేసి పారిపోతున్న క్రమంలో వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా హైదరాబాద్‌లోని దూల్‌పేట లో గుర్తు తెలియని వ్యక్తి నుండి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి 198 గ్రాముల గంజాయి ప్యాకెట్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ శ్రీను,ఎస్సై నిరేష్



మాట్లాడుతున్న ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

## స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రత్యేక చట్టం రావాలి

-ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లలో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య, జిల్లా కార్యదర్శి కె.యశోద డిమాండ్ చేశారు. శనివారం మెదక్ పట్టణంలో స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 1 నుండి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న లక్ష సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా మెదక్ పట్టణంలో సంతకాల సేకరణ కార్యక్రమన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నేషనల్ డిసెబుల్డ్ స్టడీస్ రిపోర్ట్ ప్రకారం 43.02 లక్షల మంది (రాష్ట్ర జనాభాలో 12.02 శాతం) వికలాంగులున్నారని, రాష్ట్రంలో 2024 డిసెంబర్ నాటికి 12769 గ్రామ పంచాయతీలు, 130 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్స్, 540 మండల పరిషత్‌లు ,32 జిల్లా పరిషత్లు ఉన్నాయని, ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేయడానికి ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నాయని, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున పంచాయతీ రాజ్ చట్టానికి, మున్సిపల్ చట్టానికి సవరణలు చేసి ఇద్దరు వికలాంగులను నామినేట్ చేసేందుకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018, తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019లలో సవరణలు చేసి ప్రత్యేక చట్టం చేసి వికలాంగులకు అవకాశాలు కల్పించాలని కోరుతున్నామన్నారు. స్థానిక సంస్థల్లో ఇద్దరు వికలాంగులను నామినేట్ చేస్తే గ్రామ పంచాయతీలలో 25, 538 మందికి, మున్సిపాలిటీలలో 260 మందికి, మున్సిపల్ కార్పొరేషన్లలో 26 మందికి, మండల ప్రజా పరిషత్‌లలో 1080 మందికి, జిల్లా పరిషత్లలో 64మందికి రాజకీయ అవకాశాలు వస్తాయని, రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 26,968 మందిని నామినేటెడ్ చేయడానికి అవకాశం ఉంది కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల్లో వికలాంగులకు (నామినేట్ ) ప్రతినిధ్యం కల్పిస్తూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేసి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థల్లో వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయడానికి అసెంబ్లీలో చట్టం చేస్తామని ప్రకటించడం జరిగిందని అన్నారు. 2025 మార్చి 1 నుండి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సంతకాల సేకరణ ఉద్యమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. యశోద, వర్కింగ్ ప్రెసిడెంట్ వై. దుర్గ, జిల్లా ఉపాధ్యక్షులు కిష్టయ్య, భాగ్య, స్వరూప, చంద్రమ్మ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, లింగం, సత్యమ్మ, జయమ్మ, గణేష్, లక్ష్మీ, పద్మ, కేశమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీలోని డబ్బులను లెక్కిస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, మార్చి 1 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి శివరాత్రి మహోత్సవాలలో భాగంగా భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని శనివారం స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, ఈవో శశిధర్, ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ పర్యవేక్షణలో హుండీని లెక్కించారు. ఆలయానికి వివిధ రూపాలలో మొత్తం 47,99,283 రూపాయలు వచ్చినట్లు, గత ఏడాది కంటే ఈ సంవత్సరం 10,10,982 రూపాయలు అధికంగా వచ్చినట్టు ఈవో శశిధర్, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్‌లు వెల్లడించారు. ఆలయానికి వచ్చిన భక్తులు హుండీలో వేసిన, టికెట్ల ద్వారా వచ్చిన డబ్బులను అందరి సమక్షంలో లెక్కించినటుట్లు తెలిపారు. హుండీ ద్వారా రూ. 6,18,694 రాగా, వివిధ సేవల టికెట్ల ద్వారా టికెట్ల ద్వారా రూ. 20, 98,973 రావడం జరిగిందని, వివిధ టెండర్ల ద్వారా రూ. 20,82,116 వచ్చినట్లు తెలిపారు. గత ఏడాది కంటే 10,10,982 రూపాయలు అధికంగా వచ్చినట్లు చెప్పుకొచ్చారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తలు చంద్రశేఖర్, లక్ష్మీకాంతరావు, మల్లేష్, మహిపాల్ రెడ్డి, దీప గౌడ్, మహేష్ కుమార్, ఎల్లయ్య, శ్రీనివాస్, నిర్మల, అరుణా దేవి, ప్రహ్లాద్, ప్రధాన అర్చకులు, బీరంగూడ శివాలయ సేవా సమితి ఆనంద్, పోలీస్ సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
ఫోటో8: మాట్లాడుతున్న ఎస్ఐ మహమ్మద్ గౌస్

## తూతూ మంత్రంగా పౌర హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న ఎస్ఐ మహమ్మద్ గౌస్

**కొల్చారం, మార్చి 1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ప్రజలకు ఎస్సీ కాలనీలో నిర్వహించాల్సిన పౌర హక్కుల దినం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తూతూ మంత్రంగా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ రావాల్సింది ఉండగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ మాత్రమే రావడం, ఎస్ఐ మహమ్మద్ గౌస్ ఆదరబాదరగా వచ్చి వెళ్లిపోయారు. ప్రజలు చాలా మంది వచ్చి గ్రామస్థులను స్థానిక జైన మందిరంలోకి రానివ్వడం లేదని ప్రశ్నించడం జరిగింది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ మాత్రం అట్లాంటిది ఏం జరగడంలేదని, ఎందుకు బదనం చేస్తున్నారని ప్రజలపై విరుచుకుపడ్డారు. స్థానిక కారోబార్ సైతం ఈ విషయం వాస్తవం అని చెప్పినా తరువాత మాట్లాడదామని అక్కడి నుంచి ఎస్ఐ ఏడుపాయల జాతర బందోబస్తు ఉందని వెళ్లిపోయారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ జైన్ మందిర్ ఆలయం నిర్వాహకులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అన్నారు. కొత్త శేఖర్ మాట్లాడుతూ పౌర హక్కుల దినం ఒక రోజు ముందు ప్రజలకు సమాచారం తెలపాలని, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మాత్రమే నిర్వహించాల్సిన పౌర హక్కుల దినం అర్ధగంట ముందు లోకల్‌లో ఉండే ప్రజలకు మాత్రమే తెలిపి తూతూ మంత్రంగా పౌర హక్కుల దినం నిర్వహించడం సమంజసం కాదని అన్నారు. ఈ విషయంపై ఆర్డీవోకు, జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## బిఆర్ఎస్‌లో చేరిన నాయకులు

**నవాబుపేట, మార్చి 1 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆధ్వర్యంలో దాతాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చిట్టిగిద్ద భోజిరెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, కె.బాల్‌రాజ్, కురువరాములు యాదవ్, పి.సంగంరెడ్డి, చింతల అశోక్‌రెడ్డి, నరసింరెడ్డి, శనివారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# హామీలు అన్నింటినీ అమలు చేస్తాం

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడి

**షాద్‌నగర్, మార్చి 1, ప్రభాతవార్త:**
గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చినహామీలు తుచ తప్పకుండా దశలవారీగా నెరవేర్చుదామని, నిర్భయంగా చెప్పిందే చేసేందుకు కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని, చేయాల్సింది ఇంకా చాలా ఉందని, ప్రస్తుతం చేసిన ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ఆరుహామీల్లో నాలుగు నెరవేర్చామని, మరో రెండుహామీలు త్వరలోనే నెరవేర్చుతామని అన్నారు. ఉచిత బస్సుప్రయాణం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, గృహజ్యోతి పథకాలు ప్రజలకు అమలు చేశామని వివరించారు. నియోజకవర్గంలో ప్రభుత్వం కల్పించిన పథకాల వల్ల లబ్ధి పొందిన వారి జాబితాను రూపొందించి అందరు మండలపార్టీ అధ్యక్షులకు సమాచారం ఇవ్వాలనే లక్ష్యంతో వారితో సమావేశాలు కూడా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలవల్ల గ్రామాల్లో 80నుండి 90శాతం లబ్ధి పొందుతున్నా కానీ వారికి జరిగిన లబ్ధిని గ్రామస్థాయిలోని నాయకులు, కార్యకర్తలు వివరించలేకపోతున్నారని తీవ్ర ప్రచారలోపం తమవైపు ఉందని గుర్తుచేశారు. జిల్లేడ్‌చౌదరిగూడ, నందిగామమండల కాంప్లెక్స్ సముదాయనిర్మాణంకోసం ప్రతిపాదనలు, కొందుర్గు, కొత్తూరు మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలల మంజూరీకి ప్రతిపాదనలు, అదేవిధంగా కొందుర్గు మినీ స్టేడియం, షాద్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాల, షాద్‌నగర్‌లో ఐటిఐ కళాశాల, కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామంలో బస్టాండ్‌నిర్మాణం, చౌదరిగూడ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షాద్‌నగర్‌లో డయాలసిస్ కేంద్రం, నందిగామ తహసీల్దార్ కార్యాలయనిర్మాణం మంజూరీకై ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అభివృద్ధి పెద్దఎత్తున చేపడుతుంటే ప్రతిపక్షాలు అధికార పార్టీపై ఆరోపణలు చేసేందుకు బజారులో పడి బట్టలు చింపుకుంటున్నారని ధ్వజమెత్తారు. దశలవారీగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చితీరుతుందని శంకర్ స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్, మండలపార్టీఅధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, వీరేశం, జంగ నర్సింహ్మాయాదవ్, రాజు, సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్‌అధ్యక్షుడుబాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, సీతారాం, లింగారెడ్డిగూడెం అశోక్, పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## అరబిందో స్కూల్‌లో అలరించిన సైన్స్‌ఫేర్



అరబిందో హైస్కూల్‌లో సైన్స్ ఫేర్‌ను తిలకిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**ఆమనగల్లు, మార్చి 1, ప్రభాతవార్త:**
భవిష్యత్తులో విజ్ఞానశాస్త్రం, సాంకేతికరంగాలను బలోపేతం చేసేందుకు చిన్నప్పటినుండే చదువుతోపాటు ఆయారంగాలపట్ల విద్యార్థులకు అవగాహన, ప్రావీణ్యం కల్పించవలసినబాధ్యత విద్యాసంస్థలు, ఉపాధ్యాయులపై ఉందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఆమనగల్లు మండల ఇంచార్జ్ ఎంఈఓ పాండు అన్నారు. పాఠశాలలో నిర్వహించే సైన్స్ ఫేర్ కార్యక్రమాలతో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభాపాటవాలు వెలికితీయడమేకాకుండా వారిని ఆయా రంగాల పట్ల ఆసక్తి పెంపొందించవచ్చని వారు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని అరబిందో హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమానికి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఎంఈఓ పాండు ముఖ్య అతిథులుగా హాజరైనారు. పాఠశాల కరస్పాండెంట్ నల్లబోలు సుధీర్‌రెడ్డి, అకాడమిక్ అడ్వయిజర్ ప్రేమలత అధ్యక్షతన ముఖ్య అతిథులు రిబ్బన్‌కట్‌చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వస్తుప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం



అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరులకు నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**మేడ్చల్, మార్చి 1, ప్రభాతవార్త:**
మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగ అమరవీరులు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాదిగజాతికోసం, ఏబిసిడి వర్గీకరణకోసం ప్రాణాలను త్యాగంచేసిన అమర వీరులకు పూలమాలలువేసి ఘననివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మందకృష్ణమాదిగ ఆదేశాలమేరకు మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, మాదిగజాతి ఎప్పటికీ అమరవీరుల త్యాగానికి రుణపడి ఉంటుందని తెలిపారు. వారి ఆత్మకు శాంతికలగాలని, ఏబిసిడి వర్గీకరణ సాధించుకున్న సందర్భంగా వారి త్యాగాలను మరువబోమంటూ నినాదాలుచేస్తూ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌జిల్లా యువసేన అధ్యక్షుడు డబిలీపురం పరశురాంమాదిగ, మేడ్చల్‌జిల్లా ఎమ్మెస్‌పి వైస్‌ప్రెసిడెంట్ ఎర్రవల్లి బాలనర్సింహమాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్‌నాయకులు రమేశ్‌మాదిగ, రామకృష్ణమాదిగ, సాయిలుమాదిగ, బాలకృష్ణమాదిగ, కుమార్‌మాదిగ, దిరాజ్‌మాదిగ, సుధాకర్‌మాదిగ, ప్రభాకర్ మాదిగ, భిక్షపతి, యాదగిరిమాదిగ, సుధాకర్‌మాదిగ పాల్గొన్నారు.

## దామరిగిద్ద అభివృద్ధికి చేవెళ్ల ఎమ్మెల్యే సహకారం అభినందనీయం

-దామరిగిద్ద మాజీ సర్పంచ్ వెంకటేశంగుప్తా



సిసిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న దామరిగిద్ద మాజీసర్పంచ్ వెంకటేశంగుప్తా

**చేవెళ్ళ, మార్చి 1, ప్రభాతవార్త:**
చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరిగిద్ద అభివృద్ధికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సహకారం అభినందనీయమని దామరిగిద్ద మాజీ సర్పంచ్ వెంకటేశంగుప్తా అన్నారు. శనివారం చేవెళ్లమండలం దామరిగిద్దలో 10లక్షల రూపాయల నిధులతో నిర్మించే సిసిరోడ్డు పనులకు ప్రారంభించారు. ఈ సందర్భంగా దామరిగిద్ద మాజీసర్పంచ్ వెంకటేశంగుప్తా మాట్లాడుతూ దామరగిద్దగ్రామంలో అభివృద్ధి పనులకు విరివిగా నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామానికికావాల్సిన వసతులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సమకుర్చారన్నారు. గ్రామంలో మౌలికవసతుల కల్పనకు తన శాయశక్తులా కృషిచేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యకు గ్రామస్థులు ఋణపడి ఉన్నామన్నారు. గ్రామంలో మొత్తం సిసిరోడ్లు, మురుగుకాలువలు మంజూరుచేయించి, పూర్తి చేయించారన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తనస్వంతనిధులతో తమ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దారన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు మాల నర్సింలు, అంజయ్య, బేగరి అనిల్, బోడ రామయ్య, మల్లేష్, శేఖర్, స్వామి, బీంరాజ్, కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ రాజేందర్‌రెడ్డి ఆశయసాధనకు కృషి

-తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



స్వర్గీయ రాజేందర్‌రెడ్డి విగ్రహనికి నివాళులర్పిస్తున్న తెలంగాణప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**చేవెళ్ళ, మార్చి 1, ప్రభాతవార్త:**
స్వర్గీయ రాజేందర్‌రెడ్డి ఆశయసాధనకు కృషిచేస్తామని తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. స్వర్గీయ రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం చేవెళ్ల మండలకేంద్రంలోని అయనవిగ్రహనికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్లప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి వారికిసేవలుచేయడం మా అదృష్టమన్నారు. స్వర్గీయ రాజేందర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు తమకుటుంబం నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈకార్యక్రమం లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, షాబాద్ మాజీ జడ్పిటిసి అవినాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాసన్నగారి మాణిక్యరెడ్డి, బ్యాగరి నర్సింలు, మాణిక్యరెడ్డి, మంగళి యాదగిరి, ఘనపురం చింటూ, పడాల ప్రభాకర్, రమేష్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, దండు సత్తి, రవీ, వెంకమ్మాళ్ల క్రిష్టా, ఎర్ర మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మతాలకతీతంగా ప్రజలు సహకరించుకోవాలి

-మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్‌రెడ్డి



పీస్‌కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్‌రెడ్డి

**మేడ్చల్, మార్చి 1. ప్రభాతవార్త:**
పండుగలను ప్రశాంతంగా జరుపుకునేందుకు మతాలకతీతంగా ప్రతి ఒక్కరు సహకరించి ఒకరికొకరు తోడ్పాటునందించుకోవాలని మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పీస్‌కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన ఏసిపి మాట్లాడుతూ స్థానికేతరులతోనే సమాజంలో అలజడులు జరిగే అవకాశాలు ఉన్నాయని, మతాల పేరు చెప్పి వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుడ్డిగానమ్మి ఆశ్రయంకల్పిస్తే మనకు తెలియకుండానే మన ఇంట్లోనే బాంబులు దాచిపెట్టిన సంఘటనలు గతంలో చూశామని తెలిపారు. కలిసి మెలిసి ఉన్న స్థానికులతో సమస్యలులేవని, బతుకు తెరువుపేరుతోవచ్చి అలజడులు సృష్టించే వారితోనే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా పండుగల సమయాలలోనే సమాజంలో మతాల మధ్య చిచ్చుపెట్టే అవకాశముందని తెలిపారు. కిరాయికి వచ్చేముందు వారి పూర్తివివరాలు తెలుసుకోవాలని సూచించారు. పేదల ఆకలితీర్చేందుకు జరుపుకునే రంజాన్‌పండుగను సామరస్యంగా జరుపుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఉగాది, వినాయకచవితి, బోనాలు, దసరా నవరాత్రులను సజావుగా జరిగే విధంగా ఒకరికొకరు తోడ్పాటునందించుకోవాలని సూచించారు. మైక్‌సౌండ్‌తో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నియమానుసారపద్ధతితో ఏర్పాటుచేసుకునేందుకు ప్రత్యేకసమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, వాడినా చట్టరీత్యా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో ఒకరికొకరు సహకరించుకుని జీవించాలని కోరారు. ఈకార్యక్రమంలో బిజెపి మున్సిపల్ అధ్యక్షురాలు శైలజాహరినాథ్, నాయకులు ప్రేమ్‌దాస్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అర్జున్, దశరథ్, రాఘవరెడ్డి, కాంగ్రెస్‌పార్టీమండల మాజీ అధ్యక్షుడు వర్ధారెడ్డి, ముస్లింసోదరులు మహబూబ్‌అలీ, లాయక్‌అలీ, రఫీక్, ఇనాయత్‌అలీ, ఆరీఫ్, అగాజానీ పాల్గొన్నారు.



స్వయం పరిపాలన దినోత్సవం దృశ్యం

## విద్యార్థులు ఉపాధ్యాయులు అయిన వేళ..

**కొల్చారం, మార్చి 1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంసాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థుల ద్వారా ఎదుర్కొనే సమస్యలను స్వయంగా విద్యార్థులు తెలుసుకుంటారని, బోధన అనుభవం అనేది విద్యార్థులకు ప్రాథమిక తరగతులలోనే కలగాలని, ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితభావం ఏర్పడాలని, విద్యార్థిని విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి సభాకంపం లేకుండా భవిష్యత్తులో వారు ఉన్నత విద్యావంతులుగా రాణించాలని స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లుగా తెలిఎపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారిగా కార్తీక్, మండల విద్యాధికారిగా నివాస్, పోషకుల ప్రతినిధిగా క్రాంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా వైష్ణవి, ఉపాధ్యాయులుగా స్రవంతి, నందిని, కల్పన, విక్రమ్, నవదీప్, దుర్గేష్, జగన్, శ్రీకాంత్, ఆనంద్, సికిందర్, విష్ణు, రామ్ చరణ్ తేజ్‌లు వ్యవహరించారు. పాఠశాల ఉపాధ్యాయులు యాదగిరి, మనోహర్ రావు, వైద్య శ్రీనివాస్, వసంత రాణి, వినోద, నర్సింలు, షాకీర్ అలీ, ఆనంద్ తదితరులు ఉన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు గొప్ప విషయం

-మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

**కొందుర్గు, మార్చి 1, ప్రభాతవార్త:**
ప్రజాసేవయే తనధ్యేయమంటూ ప్రజాసేవచేసిన నాయకుడి జ్ఞాపకార్థం చలివేంద్రం నిర్వహించడం గొప్పవిషయమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్యయాదవ్, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని రామచంద్రాపూర్ చౌరస్తాలో ఉత్తరాస్‌పల్లి మాజీ మండల ప్రాథమిక సభ్యుడు, బిఆర్ఎస్ మాజీ మండలపార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివంగత మధుసూదన్‌రెడ్డి మహదేవ్‌పూర్ గ్రామసర్పంచ్‌గా, సింగిల్‌విండో డైరెక్టర్‌గా, ఎంపిటిసిగా ఈప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషిచేసిననాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ ఉమ్మడి మండలాల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సయ్యద్ హఫీజ్, బోడంపాటి రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ మాజీసర్పంచ్ ఎర్రం రాజారామేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మాదిగ అమరవీరులను మరువలేము

**కీసర, మార్చి 1, ప్రభాతవార్త:**
మాదిగ అమరవీరులను మరువలేమని రాంపల్లి ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు బందెల పరమేష్ అన్నారు. శనివారం నాగారంమున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవాన్ని అంబేద్కర్‌విగ్రహంవద్ద ఘనంగా నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగజాతి అభ్యున్నతికి కృషి చేసిన అమరవీరులను మరువలేమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మీసాల మల్లేష్, ప్రధాన కార్యదర్శి మంచాల నర్సింగ్‌రావు, నాయకులు మంచాల మహేందర్, నీరుడు మధుబాబు, సాయితేజ, గౌతమ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి పెద్దపీట

-తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**వికారాబాద్‌జిల్లా ప్రతినిధి, మార్చి 1, ప్రభాతవార్త:**
ఆసుపత్రులపాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలను సిఎంఆర్‌ఎఫ్‌తో ఆదుకోవడం జరుగుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్సపొందిన తాండూరు నియోజకవర్గ పరిధిలోని బషీరాబాద్, యాలాల్, పెద్దేముల్‌మండలాలకు, తాండూరు పట్టణానికి చెందిన 77మంది లబ్దిదారులకు దాదాపు రూ.33లక్షల విలువగల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను తాండూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానికనాయకులతో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుకోని సంఘటనలు, తీవ్ర అనారోగ్యాలతో నిరుపేదలు ఆసుపత్రులపాలై అప్పుల ఊబిలో కూరుకుపోవడం జరుగుతుందని, అలాంటివారు ఆసుపత్రుల ఖర్చులకు సంబంధించిన రశీదులతో ముఖ్యమంత్రి సహాయనిధిని కోరుతూ దరఖాస్తు చేసుకుంటే వారికి సిఎం రిలీఫ్‌ఫండ్ కింద ఆదుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## గురుకుల్ అభివృద్ధి కోసం సిఎం, మంత్రులకు ఉత్తరాలు

**ఘట్‌కేసర్, మార్చి 1, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయాన్ని అభివృద్ధి పరిచి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతూ పూర్వవిద్యార్థులు ముఖ్యమంత్రి, మంత్రులకు ఉత్తరాలు పంపారు. ఈమేరకు శనివారం ఘట్‌కేసర్ తపాలా కార్యాలయంలో పూర్వవిద్యార్థి జమిరుద్దిన్‌తో పాటు మిత్రులు సిఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులందరి చిరునామాలకు ఉత్తరాలను రాసి స్పీడ్‌పోస్టు ద్వారా వేశారు. గురుకుల్‌ను కాపాడుకుందాం అంటూ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్తరాల ఉద్యమం కొనసాగుతున్నది. పూర్వవిద్యార్థి సురేశ్‌కుమార్ గురుకుల్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉత్తరాలనువేశారు. ఈకార్యక్రమంలో కంది ప్రేమ్‌కుమార్, కొత్తకొండ వెంకటేశ్, సార శ్రీనివాస్‌గౌడ్, అబ్బాస్‌అలీ, గోపాల్‌గౌడ్, శ్రీనివాస్, కృష్ణామాచారీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా పండుగలు నిర్వహించుకోవాలి: సిఐ

**ఘట్‌కేసర్, మార్చి 1, ప్రభాతవార్త:**
మతసామరస్యాన్ని చాటేవిధంగా పండుగలు జరుపుకోవాలని ఘట్‌కేసర్ఇన్‌స్పెక్టర్ పందిరి పరశురాం అన్నారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో పవిత్రరంజాన్‌మాసం ప్రారంభమైన సందర్భంగా ఆయన ముస్లిం మత పెద్దలు, రాజకీయపార్టీలనాయకులతో శాంతికమిటీసమావేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో అందరూ మతవిద్వేషాలులేకుండా పండుగలను జరుపుకోవాలని సూచించారు. అనవసరంగా శాంతిభద్రతలసమస్యలు సృష్టించేవారిపై నిఘా ఏర్పాటు చేసి చట్టపరంగాచర్యలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐలు నర్సింహ్మా, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, జామామసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్‌అజీజ్, ప్రధానకార్యదర్శి నబీ, మాజీకౌన్సిలరు బండారి ఆంజనేయులు, మాజీ కోప్షన్‌సభ్యులు ఎండి.ఇక్బాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులోదూకి మహిళ ఆత్మహత్య

**షాద్‌నగర్, మార్చి 1, ప్రభాతవార్త:**
ఫరూఖ్‌నగర్ మండలం భీమారం గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన విషాదాన్ని నింపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జమున మద్యానికి బానిసైందని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురైన జమున (45) శుక్రవారం సాయంత్రం ఇంటి నుండి అదృశ్యమయ్యింది. శనివారం ఉదయం రాయకుంట చెరువులో శవమై కనిపించింది. జమునకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, చిన్న కుమార్తె వివాహం ఈనెల 6న జరగాల్సి ఉందని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనలో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనాస్థలానికి చేరుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



హుండీ లెక్కింపు దృశ్యం

## రాజరాజేశ్వర ఆలయం హుండీ లెక్కింపు

**హుస్నాబాద్ రూరల్, మార్చి 1, ప్రభాతవార్త :** మండలంలోని పొట్లపల్లి శ్రీరాజరాజేశ్వర దేవాలయ ఆదాయం రూ.37,63,669 వచ్చినట్లు ఈవో కిషన్‌రావు తెలిపారు. శనివారం ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించగా రూ. 5,55,069 రూపాయలు రాగా విరాళాల రూపంలో రూ 4లక్షల 16వందలు, బహిరంగ వేలాలు(టెండర్)ల ద్వారా రూ. 28లక్షల 7వేల రాగా మొత్తం ఆదాయం 37,63,669 వచ్చిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఆలయానికి అదనంగా రూ 96వేల 7వందల 49 రూపాయలు వచ్చినట్లు ఆయన వివరించారు.

## ముగిసిన ఎబివిపి క్రీడోత్సవ్ ఆటల పోటీలు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

అఖిల భారత విద్యార్థి సమాఖ్య సిద్దిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో భారత్ క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం పట్టణంలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం ప్రాంత సహ సంఘటన మంత్రి విష్ణువర్ధన్, సిద్దిపేట బార్ అసోసియోషన్ అధ్యక్షులు జానార్ధన్‌రెడ్డి పాల్గొని క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నేటి విద్యార్థులే భావి భారత నిర్మాణదాతలన్నారు. నేటి యువత మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఉండేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సూర్యప్రకాష్, విభాగ్ సంఘటన మంత్రి లక్ష్మణ్, సంఘటన మంత్రులతో పాటు లక్ష్మీపతి, ఆదిత్య, పరశురాంతో పాటు తదితరులు ఉన్నారు.

## కన్నుల పండువగా ఉమామహేశ్వరస్వామి కళ్యాణం

**-హాజరైన ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**



శ్రీఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

**మర్కుక్, మార్చి 1 (ప్రభాతవార్త):** మహాశివరాత్రి పర్వదినంను పురస్కరించుకొని మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లోగల శ్రీ ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీఉమామహేశ్వరస్వామి కళ్యాణాన్ని వేదపండితుల మంత్రోశ్ఛరణల మధ్య కనుల పండుగగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, భక్తులు పెద్దఎత్తున హాజరై కళ్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా మహాశివరాత్రి సందర్భంగా వారం రోజుల పాటు శ్రీ ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం హాజరైన అతిథులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా వారిని శాలువాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్‌గుప్త, మాజీ సర్పంచ్ రాములుగౌడ్, మాజీ ఎంపిటిసి నరేందర్, గ్రామస్తులు నర్సింలు, ఆంజనేయులు, రుక్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, రాముగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్య పరిష్కరించాలి

**-మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్ హైమాద్**



ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న పర్వేజ్ హైమాద్ తదితరులు

**రాయపోల్, మార్చి 1 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మంతూర్ గ్రామంలో డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాయపోల్ మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు పర్వేజ్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ, ఉమ్మడి మెదక్ జిల్లా విద్యుత్ డైరెక్టర్‌ను కలిసి 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేసారు. అనంతరం పర్వేజ్ హైమాద్ మాట్లాడుతూ జిల్లాఎస్ఈ సానుకూలంగా స్పందించారని వెంటనే మండల ఏఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారన్నారు. ఆయన వెంట నాయకులు బాగారెడ్డి, నారాయణరెడ్డి, శాదుల్, పడిగే బాల్‌నర్సయ్య, దండు స్వామి తదితరులు ఉన్నారు.

## నవ వధువుకు పుస్తెలు మెట్టెలు అందజేత

గజ్వేల్ టౌన్, మార్చి 1 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం పురం ఆంజనేయులు కూతురు అలేఖ్య వివాహానికి శనివారం లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్, కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ గోలి సంతోష్‌కుమార్ దంపతులు పుస్తెమెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్గూర్ మాజీ ఎంపిటిసి గొడుగు జ్యోతి స్వామి, గజ్వేల్ మండల బిసిసెల్ అధ్యక్షుడు పురం ఆంజనేయులు, పురం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు అన్ని అంశాలపై అవగాహన ఉండాలి

**సిద్దిపేట అర్బన్, మార్చి 1, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతో పాటు అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని వికాస్ హైస్కూల్ ప్రిన్సిపల్ మదుమోహన్ అన్నారు. శనివారం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఐపిఎస్, ఐఎఎస్, లాయర్, డాక్టర్, టీచర్, సైంటిస్ట్ వంటి వివిధ అంశాలపై వేషాదరణ వేయించి సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింపజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే సమాజంలో విలువైన వ్యక్తుల పైన, అంశాలపైన అవగాహన కలిగి ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో మేలుచేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రలను అందజేశారు. కార్యక్రమంలో సిబిఎస్‌సి ప్రిన్సిపల్ డాక్టర్ ఉమా, డైరెక్టర్ ప్రత్యూష, ఉపాధ్యాయులు బృందం రవి తదితరులు పాల్గొన్నారు.



వివిధ వేషధారణలలో చిన్నారులు



మాదిగ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేఏసి నాయకులు



గజ్వేల్‌లో అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

# అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**జగదేవ్‌పూర్, మార్చి 1 (ప్రభాతవార్త):** ప్రభుత్వం మాదిగ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని మాదిగ జేఏసి మండల అధ్యక్షుడు మాసపాక యాదగిరి అన్నారు. జగదేవ్‌పూర్‌లో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మండల కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏర్పడినప్పటి నుండి నేటి వరకు దాదాపు 30 ఏళ్ల కాలంలో ఎస్సీ వర్గీకరణతోపాటు సమాజంలో ఉన్న అన్ని వర్గాల పేదల కోసం పోరాటంచేసి విజయాలు సాధించిన ఘనత కేవలం ఎమ్మార్పీఎస్‌కే దక్కుతుందని, ఈ పోరాటంలో ఎంతోమంది మాదిగలు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలన్నారు. ఎబిసిడి వర్గీకరణ ఉద్యమం న్యాయబద్దంగా ఉంది కాబట్టి జనాభా నరపకారంగా 11 శాతాన్ని మాదిగలకు ప్రభుత్వం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు, మండల ప్రధాన కార్యదర్శి మచ్చ గణేష్, ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, నాయకులు గడ్డం వెంకటేష్, మండల ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, మల్లేశం, గడ్డం సురేందర్, ప్రచార కార్యదర్శి స్వామి, మండల ఉపాధ్యక్షుడు కర్రె పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

### గజ్వేల్‌లో...

**గజ్వేల్ టౌన్, మార్చి 1 (ప్రభాతవార్త):**

మాదిగ అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఎస్‌పి రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఉబ్బని ఆంజనేయులు కోరారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గజ్వేల్‌లో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైద్రాబాద్ సమీపంలో ఐదు ఎకరాల స్థలంలో మాదిగ అమరవీరుల గుర్తుగా ఒక మ్యూజియం నిర్మించాలని, అలాగే అమరవీరుల స్థూపాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొమ్మని మహేష్, బుడిగె మహేష్, రాజు, మహేష్, రమేష్, రవి, ప్రభుదాస్, శనిగరి రాజు, వినోద్ పాల్గొన్నారు.



కనకయ్యను శాలువాతో సన్మానిస్తున్న మాజీ సిఎం కెసిఆర్

## కెసిఆర్‌ను కలిసిన మర్కంటి కనకయ్య

**గజ్వేల్, మార్చి 1 (ప్రభాతవార్త):** మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావును గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్, లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ మర్కంటి కనకయ్య వ్యవసాయ క్షేత్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మాజీ సిఎం చంద్రశేఖర్‌రావు మర్కంటి కనకయ్యను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మర్కంటి కనకయ్య మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి వేల కోట్ల నిధులు కేటాయించారని, వారి హయాంలోనే దేశంలో ఎక్కడ లేనివిధంగా గజ్వేల్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పాలకవర్గ సభ్యుల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని, ఇదంతా మాజీ సిఎం కెసిఆర్ చలవే అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కెసిఆర్ సూచించినట్లు తెలిపారు. అన్నివిధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## రెడ్యానాయక్ తండాలో రోడ్డుకు మోక్షం

**స్థలాన్ని పరిశీలించి మార్క్ వేసిన అధికారులు**

**ధూళిమిట్ట, మార్చి 1, ప్రభాతవార్త :** మండలంలోని రెడ్యానాయక్ తండా గ్రామపంచాయతిలో నెలకొన్న రోడ్డు సమస్యను శనివారం అధికారులు పరిష్కరించారు. ఇరవై ఏళ్ళుగా తండాలోని గిరిజన ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్ళడానికి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రోడ్డు కొరకు కేటాయించిన భూమిని అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేకపోవడంతో తండావాసులు కొంత మంది రోడ్డుకు కేటాయించిన భూమిలో ఇండ్ల నిర్మాణాలు చేపడుతూ పాఠశాలకు వెళ్ళకుండా రోడ్డు స్థలాన్ని ఆక్రమణకు గురి చేస్తుండటంతో తహశీల్దారు సింహాచలం మధుసూదన్ దృష్టి సారించి విద్యాశాఖ అధికారులను సంప్రదించి రోడ్డు వేయడానికి స్థలాన్ని పరిశీలించి శనివారం మార్కింగ్ వేశారు. దీంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

## టిఎల్ఎంతో బోధన నిర్వహిస్తే

**విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారు : డిఇవో**

**చేర్యాల, మార్చి 1, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పెద్దమ్మగడ్డ బాలుర ఉన్నత పాఠశాలలో టిఎల్ఎం (టీచర్ లర్నింగ్ మెటిరియల్) మేళా శనివారం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖధికారి ఈ.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించుటకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని దీనిలో భాగంగా టిఎల్ఎం అనేది ప్రతి ఉపాధ్యాయులు ఉపయోగిస్తూ, విద్యార్థులకు బోధన చేసినట్లయితే విద్యార్థులకు పాఠ్య బోధనతో పూర్తిగా అర్థం చేసుకుని మంచి అభ్యాసన ఫలితాలు పొందుతారని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు టిఎల్ఎం ఉపయోగిస్తూ బోధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రచ్చ కిష్టయ్య, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్లు వై.నర్సింహులు, రామస్వామి, రంగనాథ్, బి.భాస్కర్, ప్రధానోపాధ్యాయులు ఎం.ఐలయ్య, బి.నాగమణి, పీవి.చంద్రశేఖర్‌రావు మండలంలోని ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరులైన వీరులకు ఘన నివాళులు

**ధూళిమిట్ట, మార్చి 1, ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నల్ల రాజేష్ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ సాధన ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు సుందరగిరి భాస్కర్ మాదిగ మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉపకులాల అభ్యున్నతి కోసం రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ రంగాలలో తమ వాటా కోసం కొనసాగుతున్న ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ ఉద్యమంలో మాదిగ మహావీరులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా అమరులైన వారిని దైవంగా భావించాలని మాదిగ, మాదిగ ఉపకులాల వారికి సూచించారు. అమరులైన వారి ఆశయాలకు అనుగుణంగా పద్మశ్రీ మందకృష్ణమాదిగ సారథ్యంలో జనాభా దామాషా ప్రకారం సంపూర్ణ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ సాధించుకుంటామన్నారు. భవిష్యత్తు తరాలకు వీరి త్యాగాలను చరిత్రలుగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి నాగులపల్లి సంపత్, కనకస్వామి, కిష్టయ్య, చందర్, ఎల్లయ్య, శ్రీనివాస్, కనకరాజు, సుధాకర్, రాజు, వీరయ్య, పోచయ్య, మల్లయ్య తదితరులు ఉన్నారు.



బాల్యమిత్రుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న దృశ్యం

## ఘనంగా బాల్యమిత్రుల ఆత్మీయ సమ్మేళనం

**సిద్దిపేట అర్బన్, మార్చి 1,ప్రభాతవార్త :** సిద్దిపేటలో బాల్యమిత్రుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా నిర్వహించారు. 35 సంవత్సరాల తర్వాత కలుసుకున్న బాల్య ఆత్మీయ మిత్రులు తమ చిన్ననాటి మధురానుభూతిలను ఆత్మీయతను పంచుకున్నారు. మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరి ఒకరిని అలింగనం చేసుకుంటూ ఆత్మీయతను పంచుకున్నారు. చిన్ననాటి కొంటే చిలిపి పనులను గుర్తు చేసుకున్నారు. బాల్య ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన వినోద్ మోదానిని ఆత్మీయ బాల్య మిత్రులు అభినందించారు. 1988 బ్యాచ్ ద్వారా సేవ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో మెమోంటోలు అందజేసి సన్మానించారు. అనంతరం ఆట పాటలతో నృత్యాలతో అలరించారు. సమ్మేళానికి అమెరికా నుంచి గోపి సిరినేని, దేవేందర్‌రెడ్డి, రాజేందర్, జ్ఞానేశ్వర్‌లు విచ్చేసి పాల్గొన్నారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు వంశీధర్‌రావు, సురేందర్, అశోక్, సిద్దులు, ఆకుల పాండురంగం, నరేందర్, ఫయాజ్, కొండల్, బిఎల్ శ్రీను, మోహిన్‌బాబా, నర్సింగరావు, సత్యనారాయణ, అనంద్, ఉత్తంరావు, కనకయ్య, రాజ్‌బహదూర్, రాజేష్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపూర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

**జగదేవ్‌పూర్, మార్చి 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో ఆశ్రయం హాండ్ ఆఫ్ హోప్ సంస్థ వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామ చర్చి ఫాస్టర్ కిస్టఫర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామంలోని ప్రజలకు ఉచితంగా రక్త పరీక్షలు, బిపి, షుగర్, ఎక్స్‌రే, ఈసిజి, కంటి పరీక్షలు నిర్వహించి మందులను, కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంప్ టీం లీడర్ జంగ జయరాజు మాట్లాడుతూ ఆశ్రయం హాండ్ ఆఫ్ హోప్ సంస్థ గ్రామాల్లోని పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, మానవ సేవయే మాధవ సేవ అనే విధంగా పేద ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో సుమారు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాగచందన, భరత్, భక్తసింగ్, మనోజ్ఞ, సంపత్, ఆశ్రయం పారా మెడికల్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్స్ కుసుమ, ఫార్మసీ స్వామి, సాముయేలు, నరసింహ, వెంకట్, సోలొమోను, గ్రామ మాజీ సర్పంచ్ మాసపాక యాదగిరి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మల్లేశం, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కనుల పండువగా ఆది దంపతుల కళ్యాణోత్సవం

**చిన్నశంకరంపేట, మార్చి 1, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శ్రీసోమేశ్వర ఆలయ 5వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం నాడు ఆది దంపతులైన శివ, పార్వతుల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఈ కళ్యాణోత్సవాన్ని వేద పండితుల మధ్య, డప్పు వాయిద్యాలు, బాజా భజంత్రిలతో వందలాది మంది భక్తుల మధ్య శివ పార్వతుల కళ్యాణాన్ని జరిపారు. అంతకు ముందు ఉదయం అగ్ని గుండాలు, సుప్రభాత సేవ, గణపతిహోమం, రుద్ర హోమం, రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ తాజా మాజీ సర్పంచి రాజిరెడ్డి దంపతుల చేతుల మీదుగా వేద పండితుల ఈ కళ్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమాన్ని పట్టణంలోని పురవీధుల గుండా తిప్పుతూ జరిపించారు.



అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# కౌడిపల్లి మండలంలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు

**పశు వైద్యాధికారిని పర్వీన్ ఫాతిమ**



భుజిరంపేటలో కోళ్ల ఫాంను సందర్శించి, పరిసరాలను పరిశీలించిన పశువైద్యాధికారి పర్వీన్ ఫాతిమ

**కౌడిపల్లి, మార్చి 1, ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా ఎక్కడా బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు లేవని పశు వైద్యాధికారిని పర్వీన్ ఫాతిమ పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం ఒక దిన పత్రిక(వార్తలోకాదు)లో బర్డ్‌ఫ్లూతో కోళ్ల మృతి అని ఒక వార్త పచురితమైనదానికి వెంటనే మండల వ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫాం షేడ్లను తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేసినట్లు తెలిపారు. కంచెన్‌పల్లి గ్రామంలోని ఫౌల్ట్రి షేడ్స్ అన్ని తనిఖీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఎక్కడా కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు కనిపించ లేదని, పైగా షేడ్స్‌ల్లో కోళ్ల లేవని అమె తెలిపారు. భుజిరంపేట గ్రామానికి చెందిన కేతవత్ శ్రీను గతంలో తన షేడ్స్‌లో స్నేహ చికెన్ కంపెనీ వారి కోడి పిల్లలు పంపిణి చేశారు. కాగా రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాధితో కోళ్ల మృతివాత చెందుతున్నందున కారణంగా స్నేహ కంపెనీ వారు కోడి పిల్లలు ఇవ్వక పోగా కేతవత్ శ్రీను శ్రీరామ కంపెనీతో మాట్లాడు కొని సొంతఆలోచనతో కోళ్ల పెంచుకోవడం జరుగుతుందని ఆమె అన్నారు. అవి ఒకేసారి కాకుండా గత వారం రోజులుగా కొన్ని కొన్ని కోళ్ల మరణించడం జరిగిందని ఆమె అన్నారు. అవి అనారోగ్యంతో మృతి చెందాయా లేక మందులు వాడకంలో తేడాలు రావడంతోనా? లేకా ఇతర సమస్యలతోనా తెలియాల్సి ఉంది ఆమె తెలిపారు. అంతేకాని బర్డ్‌ఫ్లూ వ్యాధి అని నిర్ధారణ చేయలేమని ఆమె తెలిపారు. ప్రస్తుతం తనిఖీలు చేసిన షేడ్స్‌ల్లో ఎక్కడా ఎక్కువ శాతం కోళ్లు మృతి చెందిన విషయం తమ దృష్టికి రాలేదని ఆమె అన్నారు. కోళ్ల పెంపకం చేసే రైతులు, ప్రజలు ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, తన సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం

**సిద్దిపేట అర్బన్, మార్చి 1, ప్రభాతవార్త :** అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ యేడు సభ్యత్వాలు, క్లబ్స్ పెంచడంతోపాటు 200 సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయని కన్వెన్షన్ ఇంటర్నేషనల్ సెకండ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఈఆర్ బాలగంగాధర్ శాస్త్రి, ఇంటర్నేషనల్ డైరెక్టర్ ప్రత్యేక అతిథి బొజ్జ మదుసూధన్, ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ మంత్రి లింగమూర్తి, బెజుగామ ఆత్మరాములు, సౌత్ మల్లిపుల్ వైస్ చైర్మన్ మోర అంజయ్యలు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్ అసోసియేషన్‌లో శుక్రవారం రాత్రి అలయన్స్ జిల్లా గవర్నర్ చకిలం బాలచంద్రం జిల్లా 10వ కన్వెన్షన్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21,22, 24వ తేదీలలో చైన్నై ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనలన్నారు. జిల్లాలోని 18 క్లబ్‌లు బ్యానరు ప్రెజెంటేషన్ చేయడం అభయజ్యోతి స్కూల్‌లో బియ్యం, కిరాణా సామాగ్రి పంపిణీ చేశారు. బ్యానర్ ప్రజెంటేషన్ చేసిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఫాస్ట్ గవర్నర్లు, 18 క్లబ్‌ల సభ్యులు 250 మంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

**ప్రిన్సిపాల్ కాయిత నారాయణరెడ్డి**

**హుస్నాబాద్ టౌన్, మార్చి 1, ప్రభాతవార్త :** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ కాయిత నారాయణరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సర్ సివి రామన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వైద్య విజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి గణితం, పరిసరాల పరిశుభ్రత, విజ్ఞానం, ఆంగ్లం విషయ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృదంతో పాటు విద్యార్థుల తల్లితండ్రులు ఉన్నారు.

## హుస్నాబాద్ మార్కెట్ యార్డుపై ప్రత్యేక విచారణ చేపట్టాలి

**బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జునరెడ్డి**

**హుస్నాబాద్ రూరల్, మార్చి 1, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మార్కెట్ యార్డులో జరిగిన సిసిఐ పత్తి కొనుగోలు విషయంలో ప్రభుత్వం మార్కెట్ యార్డుపై ప్రత్యేక విచారణ చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రోజున పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన సిసిఐ పత్తి కొనుగోళ్ల విషయంలో అనేక అక్రమాలు జరిగాయని ఈ విషయంలో మార్కెట్ కమిటి పాలకవర్గం దళారులతో చేతులు కలిపి చేసినట్లు అనిపిస్తుందన్నారు. దళారులు పత్తిపంటను రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగోలు చేసి సిసిఐలో రైతుల పేరుమీద ఎక్కువ దరలకు విక్రయించి అడ్డగోలుగా దోచుకున్నారని ఈ దళారులకు కాంగ్రెస్ పార్టీ నాయకుల అండ ఉందని ఆరోపించారు. పూర్తి స్థాయి విచారణ చేపడితే కాని ఎవరి పాత్ర ఉందో అర్థమౌతుందన్నారు. సిసిఐ కొనుగోళు వ్యవహారంలో ఏవోను సస్పెండ్ చేసిన విధంగానే వ్యవసాయ మార్కెట్‌లోని అవినీతి అధికారులు, పాలకవర్గంపై చర్యలు తీసుకోవడానికి వీలుంటుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

## పేద విద్యార్థినికి లాప్‌టాప్ అందజేత

**మర్కుక్, మార్చి 1 (ప్రభాతవార్త):** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కవిత సహకారంతో చేబర్తి గ్రామానికి చెందిన నిరుపేద వైద్య విద్యార్థిని కృష్ణవేణికి రూ.70 వేల విలువైన లాప్‌టాప్‌ను శుక్రవారం అందజేశారు. విద్యార్థిని పైచదువుల నిమిత్తం లయన్ రమణారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ దృష్టికి తీసుకురాగా స్పందించిన లయన్స్ ఇంటర్నేషనల్ 320డి లయన్ అమర్నాథ్‌రావు, లయన్ సాయిరాంలు విద్యార్థినికి లాంటాప్ అందజేసేందుకు సహకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు నరహరిప్రసాద్, భూజాత, వందన, రమేష్, పద్మారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, గణేష్, రమణారావు, సిద్దయ్య, కృష్ణ, ఫౌసియా, మాధవి, బుచ్చయ్య, కవిత, స్వామి, ఆర్‌ఏ మునీర్, శ్రీలత, రాములు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారం చేయడం సరికాదు

**కొమురవెల్లి, మార్చి 1,ప్రభాతవార్త :** శ్రీ కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం తోట బావి ఆవరణలో నిర్వహించిన పెద్దపట్నం దాటిన తనపై కొంత మంది పనిగట్టుకొని తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని మల్లికార్జున స్వామి దేవాలయ ధర్మకర్త కే.జయప్రకాష్‌రెడ్డి శనివారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటకు వెళ్లే సమయంలో పాదరక్షలు వేసుకొని ఉన్న సమయంలో పాదరక్షలు వేసుకొని పెద్దపట్నం దాటారని ప్రచారం చేయడం ఎంత వరకు సమంజస మని ప్రశ్నించారు. మల్లికార్జున స్వామి అన్నా అచార సాంప్రదాయాలన్నా.. ఎనలేని భక్తి గౌరవం విశ్వాసం ఉందన్నారు. ప్రతి ఏటా కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని పట్నాలు వేయడం స్వామివారు ఇంటి ఇలవెల్పన్నారు. ఆలయ పవిత్రత కాపాడడానికి ఒక ధర్మకర్తగా కృషి చేయడం జరుగుతుందని తప్పుడు ప్రచారాలు భక్తులు, ప్రజలు నమ్మవొద్దన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

**కొమురవెల్లి, మార్చి 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం టెన్త్ విద్యార్థులకు బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి పరీక్ష సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. మొదటి స్థానంలో నిలిచే విద్యార్థికి రూ.11.116, ద్వితీయ స్థానంలో నిలిచే విద్యార్థికి రూ.5116 అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు, మాజీ సర్పంచ్ స్వామిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట, మార్చి 1,ప్రభాతవార్త:** మండల పరిధి జంగరాయి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త నరసవ్వ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శనివారం రూ.5వేల ఆర్థిక సహాయం పంపగా బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బందెల ప్రభాకర్, సురేష్, భూపాల్‌రెడ్డి, శ్యామ్, బాగారెడ్డి, రవీందర్‌రెడ్డి, సంజీవరెడ్డిలు బాధిత కుటుంబానికి అందించారు.

## శాంతియుతంగా రంజాన్ పండుగ జరుపుకోవాలి

**-గజ్వేల్ సిఐ సైదా**

**గజ్వేల్, మార్చి 1 (ప్రభాతవార్త):**

రంజాన్ మాసం సందర్భంగా శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని గజ్వేల్ సిఐ సైదా పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని పిఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ముస్లీం, హిందూ సోదరులు కలిసిమెలిసి ఉండాలని అన్నారు. రేపటి నుండి రంజాన్ మాసం మొదలవుతుంది కాబట్టి పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రంజాన్ మాసంలో ఎక్కువ మంది ముస్లీంలు ఉపవాసం ఉండడం జరుగుతుందని, అలాగే ఇందిరాపార్కు చౌరస్తా, సంగాపూర్ రోడ్డు వద్ద పండ్లు అమ్మడం జరుగుతుంది కాబట్టి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్త వహించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళికి తెలిపారు. రాత్రి వేళలో పిల్లలు వెహికిల్ రాష్ డ్రైవింగ్ చేయడం జరుగుతుంది కాబట్టి తల్లిదండ్రులు దృష్టిలో పెట్టుకొని పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, జశ్వంత్‌రెడ్డి, నక్క రాములుగౌడ్, స్వామి, మహేష్, బాల్‌కుమార్, నాయిని సందీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ సైదా



ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్న మార్కండేశ్వర ఆలయం

## 3 నుంచి మార్కండేశ్వర ఆలయ ప్రారంభోత్సవ పూజలు

**నారాయణఖేడ్, మార్చి 1, ప్రభాతవార్త:** ఈ నెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు యతీశ్వరుల, మునుల, సాధుసంతుల ఆధ్వర్యంలో పట్టణ శివారులోని వంకటాపూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన శ్రీమార్కండేశ్వర ఆలయ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు ఆరంభం కానున్నాయి. తూర్పు అభిముఖంగా మార్కండేశ్వర ఆలయం ప్రతిష్టించేలా పద్మశాలీలు ఆలయాన్ని నిర్మించారు. 2023 ఆగస్టు మాసంలో ఆరంభమైన మార్కండేశ్వర ఆలయ నిర్మాణం పనులు పూర్తయి 3 మార్చి 2025న విగ్రహాల ప్రతిష్టాపనకు అంకురార్పణ కానున్నాయి.

## జాతర హుండీ ఆదాయం రూ. 61.50 లక్షలు



ఏడుపాయల జాతర హుండీని లెక్కిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, మార్చి 1, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని 3 రోజుల పాటు నిర్వహించిన ఏడుపాయల వనదుర్గా భవాని మాత మహాజాతర ఉత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న భక్తులు మొక్కుబడిలో భాగంగా హుండీలో చెల్లించుకున్న నగదును శనివారం రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో గోకుల్ షెడ్‌లో దేవాదాయ ధర్మాదా శాఖ ఉత్సవ ప్రత్యేక అధికారి అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ పర్యవేక్షణలో లెక్కించారు. బంగారం, వెండి, వస్తువుల మినహా నగదు రూపంలో 24లో రూ. 56,277 ఆదాయం సమకూరిందని, ప్రసాద విక్రయాల ద్వార రూ. 28లక్షల 71వేల 60, ప్రత్యేక దర్శనాల ద్వారా 9లక్షల 8వందలు, కేశఖండనం ద్వార రూ. 68,150, ఒడి బియ్యం ద్వార రూ. 53,950 రాగా 16 రోజుల హుండీతోపాటు రూ.61,50,237 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, యాదగిరి, రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొనగా పాపన్నపేట పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

## కంగ్టిలో మాదిగ అమరవీరుల దినోత్సవం



నినాదాలుచేస్తున్న ఎంజెఎఫ్ జిల్లాఅధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు

**కంగ్టి, మార్చి 1, ప్రభాతవార్త:** అమరవీరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎంజెఎస్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్ అన్నారు. శనివారం కంగ్టిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణ ఆదేశాల మేరకు మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సదర్భంగా 2 నిమిషాలు మౌనం పాటించి అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, మండల అధ్యక్షులు ములే సల్మాన్ మాట్లాడుతూ వర్గీకరణకు అసువులు బాసిన మాదిగ అమరవీరుల పోరాట ఫలితంగానే హక్కులు సాధించుకోగలిగామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడి అమరులైన మాది అమరవీరులను మననం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్ ఎంజెఎఫ్ కార్యదర్శి ములే రమేష్, కన్వీనర్ బాబు, ములే దేవిదాస్, జాదవ్ రమేష్, మల్లేష్, స్వామిదాస్, శ్రీమాన్, మోహన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్ జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా వార్షికోత్సవం

**న్యాల్‌కల్, మార్చి 1, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వార్షికోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థులు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సచ్చిదానందరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ గున్నెల్లి రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులకు సన్మానం



దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులను సన్మానిస్తున్న అల్లారి వీరేశం

**ఝరాసంగం, మార్చి 1, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళా ఉత్సవాల్లో దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ అందచేసిన సేవలను గుర్తించి అఖిల భారత జూన అఖడ గుర్తించి అభినందించడం ఆనందంగా ఉందని దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశంగుప్తా అన్నారు. అల్లాడి వీరేశం ఆస్ట్రేలియా పర్యటన ముగించుకుని శనివారం మండలపరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆశ్రమ పీఠాధిపతులు 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిర మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌లను ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు అందుకున్నారు. 41 రోజులపాటు ఆశ్రమం తరఫున మహాకుంభమేళాకు చేరుకున్న తెలుగు రాష్ట్రాల భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. సేవలను గుర్తించిన జూన అఖడ 1108 బిరుదుతోపాటు ఆశ్రమానికి మహామండలేశ్వర పీఠాధిపతగా నియమించడం హర్షణీయంగా ఉందన్నారు. భారత దేశ వ్యాప్తంగా కుంభమేళాలు ఎక్కడ జరిగినా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## నల్లవాగు నీటిని పంటలకు సరఫరా చేయాలి

**సిర్గాపూర్, మార్చి 1, ప్రభాతవార్త:** నల్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా రైతులు సాగు చేసుకుంటున్న పంటలకు సరఫరా చేయాలని జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బిపు మచ్చేందర అన్నారు. శనివారం నల్లవాగు ప్రాజెక్ట కట్టపై ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మచ్చేందర్ మాట్లాడుతూ ప్రాజెక్టులో నీరు ఉన్నా పంటలు ఎండుకుపోవడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు సాగునీటి కొరకు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఆత్మ కమిటి డైరెక్టర్ అనుముల మారుతి, ర్యాలమడుగు మాజీ ఎంపిటిసి సభ్యులు అగ్రమేనాయక్, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ క్రిష్ణారెడ్డి, నాగిరెడ్డి, అనుముల తుకారాం, గుబ్బిపు నర్సింలు, పరశురాంరెడ్డి, అశోక్, నగేష్, విజయ్‌రాజు, కిషన్ సింగ్, శ్రీనివాస్, అభి. నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# చికెన్‌ను బాగా ఉడికించి తినవచ్చు : ఎమ్మెల్యే

**ఉచితంగా చికెన్, కోడిగుడ్ల పంపిణీ ఎగబడిన జనాలు**



చికెన్, ఎగ్స్ కోసం ఎగబడుతున్న జనాలు

**నర్సాపూర్, మార్చి 1. ప్రభాతవార్త :** పట్టణంలో నిర్వహించిన చికెన్ ఎగ్స్ మేళాలో ఉచితంగా పంపిణీ చేసే చికెన్ ఎగ్స్ కోసం జనాలు ఎగబడ్డారు. కోళ్లల్లో బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో వచ్చిన అపోహలు తొలగించడానికి వెంకాబ్ చికెన్ కంపెనీ సౌజన్యంతో నర్సాపూర్‌లోని గోల్డెన్ చికెన్ సెంటర్ యజమాని టిఆర్ఎస్ నాయకులు షేక్‌హుస్సేన్ ఆధ్వర్యంలో చికెన్, ఎగ్స్ మేళను సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై మాట్లాడుతూ కోళ్లల్లో బర్డ్‌ఫ్లూ ఉన్నట్లు పుకార్లు వస్తున్న నేపథ్యంలో ఈ చికెన్ మేళాను నిర్వహించినట్లు తెలిపారు. చికెన్ 70 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికించి తింటే ఎటువంటి ప్రమాదం లేదన్నారు. కోళ్లపై వస్తున్న అపోహలను ఎవరూ నమ్మవద్దని ఎక్కువగా ఉడికించి చికెన్‌ను తినవచ్చని ఆమె సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా ప్రజలకు చికెన్‌ను పంపిణీ చేశారు. కాగా ఎమ్మెల్యే సునీతారెడ్డి సైతం ఈ చికెన్ వంటకాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నహిముద్దీన్, చికెన్ మేళా నిర్వాహకులు షేక్‌హుస్సేన్, ముజీబ్, మోసిన్, మోబిన్, మక్సూద్, మాజీ సర్పంచులు జితేందర్‌రెడ్డి, సేనాధిపతి, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు



పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులుఅందజేస్తున్న ఎంఈవో,ప్రిన్సి పాల్

## ఘనంగా ఫేర్‌వెల్, సైన్స్ ఫెయిర్

**నర్సాపూర్, మార్చి 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జక్కపల్లి తెలంగాణ మోడల్ స్కూల్లో ఫేర్వెల్, సైన్స్‌ఫెయిర్, టిఎల్ఎం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు చేసిన ప్రయోగాలను పలువురు తిలకించారు. అంతేకాకుండా ముగ్గుల పోటీలతో పాటు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ తారాసింగ్, ప్రిన్సిపల్ ఫర్హాన బహుమతులు అందజేశారు.

**తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం**

తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ పర్హాన తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లు ఖాళీగా ఉండగా 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయటానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తులు చేసుకునేందుకు మార్చి 10 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు తెలిపారు. పాఠశాలలో అడ్మిషన్లు పొందే విద్యార్థులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పర్హానా తెలియజేశారు.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



చిన్నశంకరంపేటలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

**చిన్నశంకరంపేట, మార్చి 1,ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు 14వ విడుత మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సామాజిక తనిఖీని జిల్లా అడిషనల్ పీడీ రంగా చార్యులు తనిఖీ చేశారు. 2023-24 వార్షిక సంవత్సరానికి గాను మండల వ్యాప్తంగా 349 పనులు చేపట్టారని, కూలీలకు, కొనుగోలు చేసిన వస్తువులకు రూ.8,39,45,557 కోట్ల రుపాయలు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. పంచాయతీ రాజ్ పథకంలో 35 పనులు జరిగాయని, కూలీలకు కొనుగోలు చేసిన వస్తువులకు రూ.3,66,78.609 కోట్ల రుపాయలు ఖర్చు చేసినట్లు ఆయన వివరించారు. అనంతరం ఉపాధి హామి సిబ్బంది నుండి రూ.1,46,984లక్షల రుపాయలను రికవరి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామి సిబ్బందికి 20వేల రుపాయలను జరిమాన విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సోషల్ అడిట్ అధికారి సంపత్, హెచ్ఆర్ మెనెజర్ రాజేందర్‌రెడ్డి, సోషల్ అడిట్ ఎస్ఆర్పి రవి, ఎంపీడీవో దామోదర్,ఏపీవోలు వెంకటసాయి, రాజ్ కుమార్, ఆయా గ్రామాలు పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

## వైభవంగా శివ పార్వతుల కళ్యాణం

**చిన్నశంకరంపేట,మార్చి 1,ప్రభాతవార్త:** మండల పరిధి రుద్రారం గ్రామంలో శ్రీ సంగమేశ్వర స్వామి 76వ బ్రహ్మోత్సవాలు ఆలయకమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవాలయంలో మహ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శివ పార్వతుల కళ్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, త్రికాలార్చన, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బండిశిడి, చిన్నపిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచి మంచాల లక్ష్మణ్, సిద్దిరాములు, గణేష్,ప్రకాష్,ప్రసాద్, కిరణ్,రాము, వినయ్ కుమార్, వరప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



శివ, పార్వతుల కళ్యాణం జరుపుతున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యాక్షులు పుర్ర ప్రభాకర్ మాదిగ

## మార్చి 1 మాదిగ అమరవీరుల దినోత్సవం

**ఎంఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్‌మాదిగ**

**కొల్చారం, మార్చి 1 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ల సాధనకై 30 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమ పోరాటంలో అనేక మంది అమరులు పరోక్షంగా, ప్రత్యక్షంగా నేలకొరిగారని,వారిని స్మరించుకోవడానికి మార్చి 1వ తేదీన మాదిగ అమరవీరుల దినోత్సవంగా లిఖించబడిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్‌మాదిగ అన్నారు. శనివారం కొల్చారం మండలం సంగాయిపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుర్ర ప్రభాకర్ మాదిగ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా మంత్రివర్గంలో మాదిగలకు స్థానం లేకపోవడం బాధాకరమైన విషయమన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మాదిగలకు పూర్తిస్థాయిలో దక్కాల్సిన రాజకీయ స్థానం, రిజర్వేషన్ శాతాలు దక్కలేదని, జనాభా దామాషా ప్రకారం కానీ, ఎస్సీ రిజర్వుడ్ పార్లమెంట్ టికెట్లలో కానీ కాంగ్రెస్ పార్టీ మాదిగలకు అన్యాయం చేసిందని స్పష్టంగా కనిపిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల అభివృద్ధిపై చిత్తశుద్ధి చాటుకోవాలనుకుంటే మాదిగలకు మంత్రివర్గ విస్తరణలో రెండు స్థానాలు కేటాయించాలని, అవసరమైతే విద్యాశాఖ మంత్రి పదవిని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పదవిని మాదిగలకు కేటాయించాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ద్వారా అత్యధిక నిధులు కేటాయించాలని, అదేవిధంగా మాదిగ విద్యార్థుల కోసం విదేశీ విద్య ద్వారా అధిక నిధులు ఇవ్వాలన్నారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రోళ్ల సంజీవయ్య మాదిగ, ఎంఎస్ఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పుర్ర మహేష్ మాదిగ, యువ నాయకులు పుర్ర అనోక్ మాదిగ, చిన్నిగారి శ్రీనివాస్ మాదిగ, ప్రతాప్ మాదిగ, జాను మాదిగ, గిరి, నందు, టింకుల్, అఖిల్ పాల్గొన్నారు.

## ఘనంగా మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**వెల్దుర్తి, మార్చి 1 ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు మాసాయిపేట మండల కేంద్రంలో ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి ముక్క వినోద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మొగిలిగుండ్ల ప్రభాకర్ మాదిగల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మాసాయిపేట యాదగిరి మాదిగ పాల్గొని ప్రసంగించారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో జాతి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పి ఉమ్మడి రిజర్వేషన్‌ల వల్ల మాదిగ, మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ముప్పై ఏళ్లుగా కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు ప్రభుత్వాల కుట్రలను ఎదుర్కొంటూ అధికార ప్రభుత్వాలు అవలంభిస్తున్న మాదిగ వ్యతిరేక చర్యలను ఎండగడ్తూ జరిగిన పోరాటంలో ఎందరో మాదిగ ఉద్యమ కారులు అమరులయ్యారని అన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం ముందుకు సాగుతామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మాదిగ, మాదిగ ఉపకులాల ఆకాంక్షను గౌరవించాలని, ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణచేసి మాదిగలకు, ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు దాతర్పల్లి భిక్షపతి మాదిగ, కార్యదర్శి భాస్కర్ మాదిగ, అక్కింపేట భాను మాదిగ, శేషన్ శరత్ మాదిగ, మాసాయిపేట గ్రామ అధ్యక్షులు బొడ్డు నరేష్ మాదిగ, శ్రావణ్ మాదిగ, చింటు మాదిగ, శ్రీకాంత్ మాదిగ, శ్రీరాములు మాదిగ, డేవిడ్ మాదిగ, సుదర్శన్ మాదిగ, కొత్తపేట నర్సింలు మాదిగ, లింగారెడ్డిపల్లి స్వామి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

# నర్సాపూర్‌లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**నర్సాపూర్, మార్చి 1, ప్రభాతవార్త :**

నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని నల్లవల్లి ప్యారా నగర్ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా అఖిల పక్షం ఆధ్వర్యంలో పట్టణంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. శనివారంతో ఈ నిరాహార దీక్షలు 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ, నర్సాపూర్ ఆటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును తరలించకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకతీతంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటైతే నర్సాపూర్ రాయరావు చెరువుతో పాటు పరిసర గ్రామాలు కలుషితం అవుతుందన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురై అనేక ఇబ్బందుల పాలవుతారని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ డంప్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు మురళీ యాదవ్, హన్మంత్ వెంకట రమణారావు, గోద రాజేందర్, సంఘసాని సురేష్, కొత్త శ్రీనివాస్‌గుప్త, ఎర్రగోళ్ల రమేష్‌యాదవ్, పంబల్ల, బిక్షపతి, పంబల్ల రామచందర్, ధనసింగ, మహేష్, రమేష్, ఆంజనేయులుగౌడ్, కాసిం,కొండి కుమార్, శంకర్, మాచనూరి సురేష్, ఎద్దు సురేష్, చోటి కార్తీక్, ఎద్దు మల్లేష్, లక్ష్మణ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.





నిరాహార దీక్షలో పాల్గొన్న అఖిల పక్షం నాయకులు తదితరులు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి

## ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**-ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి**

**నారాయణఖేడ్, మార్చి 1, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్‌లు ఇవ్వని కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి కోరారు. శనివారం దత్తురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్న దృష్ట్యా అధికారులు పరీక్షలు సవ్యంగా సాగేలా చూడాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరుగకుండా చూడాలని, పరీక్ష కేంద్రాలవద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల వద్ద హెల్త్ కిట్లను ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సంఖ్యన అనుగుణంగా ఆర్టీసి బస్సులు నడపాలని దత్తురెడ్డి డిమాండ్ చేశారు.

## ఎల్‌ఓసి అందచేసిన ఉమాదేవి శెట్కార్

**నారాయణఖేడ్, మార్చి 1, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణం శివారులోని అల్లీపూర్ గ్రామానికి చెందిన జి.మహేస్ అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందుకునేందుకు రూ. 50 వేలు మంజూరు చేయించగా శనివారం ఎంపి సతీమణి ఉమాదేవి సురేశ్‌కుమార్ శెట్కార్ బాధిత కుటుంబానికి అందచేశారు. ఎల్‌ఓసి అందుకున్న మహేష్ కుటుంబ సభ్యులు ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేదల ఆరోగ్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపకరిస్తుందని ఉమాదేవి సురేష్‌కుమార్ శెట్కార్ అన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్‌ఒసి అందజేత

**నారాయణఖేడ్, మార్చి 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అబ్బెంద గ్రామానికి చెందిన ఎం.శంకర్ అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ శంకర్ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు 1.5 లక్షల రూపాయలను మంజూరు చేయించగా శనివారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసిని అందచేశారు. ఎల్‌ఓసి అందుకున్న శంకర్ కుటుంబ సభ్యులు ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేదల ఆరోగ్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపకరిస్తుందని రాకేష్ శెట్కార్ అన్నారు. కార్యక్రమంలో మైకోడ్ గ్రామానికి చెందిన శివకుమార్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలపైనే అందరికీ ఆసక్తి

**-మార్చి 10వరకు చేరేందుకు అవకాశం**

**నారాయణఖేడ్, మార్చి 1, ప్రభాతవార్త:** కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఆదర్శ పాఠశాలలు నిలుస్తుండటంతో తమ చిన్నారులను ఆ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు, చదువుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుస్తున్నారని చెప్పడం అతిశయోక్తి కాదు. మధ్య,పేద తరగతి వారు ఇంగ్లీషు మీడియంలో విద్యను అందుకునేందుకు ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. బాలికలకు వసతి గృహంలో ఉండే వీలుండటంతో తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను ఆదర్శపాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా తల్లిదండ్రులు తమ చిన్నారులను ఆదర్శపాఠశాలల్లో చేర్పించి ఉన్నత శిఖరాలకు చేరుకుంటుండటంతో ప్రతి విద్యార్థి ఆదర్శ పాఠశాలలో చేరి విద్యను అందుకోవాలని ఆరాటపడుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 10వ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తుల స్వీకరణ మార్చి 10వ తారీఖు వరకు పొడగించింది. 10వ తరగతిలో అందుకున్న మార్కుల ఆధారంగా ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

## హన్మంత్‌రెడ్డికి నివాళులర్పించిన నరోత్తం

**న్యాల్‌కల్, మార్చి 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాకిజనవాడ గ్రామానికి చెందిన నాయకులు హన్మంత్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుసుకున్న ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం శనివారం గ్రామానికి చేరుకుని హన్మంత్‌రెడ్డి పార్థీవ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి ప్రకటించారు. నరోత్తం వెంట మాజీ సర్పంచ్ వీరారెడ్డి, నాయకులు మల్లయ్యస్వామి, గార్లపల్లి శివరాజ్, జనార్ధన్‌రెడ్డి, సంగారెడ్డి, మల్లికార్జున్‌లు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీనివాస్

**నారాయణఖేడ్, మార్చి 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చప్టా(కే) గ్రామానికి చెందిన చల్కె సంగారెడ్డి కుమారుడి వివాహ వేడుకల్లో టిపిసిసి సభ్యులు కర్నె శ్రీనివాస్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కర్నె శ్రీనివాస్ వెంట కాంగ్రెస్ నాయకులు కొండల్ రెడ్డి, అంజిరెడ్డి, పండరిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నందు తదితరులు పాల్గొన్నారు.

## సయ్యద్ గట్టు మౌలాలి గంధాల ఉత్సవాలు

**నారాయణఖేడ్, మార్చి 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని జుజాల్పూర్ గ్రామంలో సయ్యద్‌గట్టు మౌలాలి దర్గా ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాలు సాగే ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రికి గంధం ఊరేగింపు, ఖవాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం జల్సా, అలయ్, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ బాధ్యులు పేర్కొన్నారు.

## ఎంపి కాన్వాయ్‌పై దాడి హేయమైన చర్య

**-సామాజిక ఉద్యమకారుడు గణపతి**

**నాగల్‌గిద్ద, మార్చి 1, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లో భీమ్ ఆర్మీ చీఫ్, ఎంపి చంద్రశేఖర్ ఆజాద్ కాన్వాయ్‌పై జరిగిన దాడి హేయమైందని సామాజిక ఉద్యమకారుడు ఎస్ గణపతి తీవ్రంగా ఖండించారు. శనివారం గణపతి స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పాలనలో భారత దేశం కులవివక్ష ఇంకా బలంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల సమక్షంలోనే ఎంపి కాన్వార్‌పై దాడి జరిగిందని, అయినా నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో దళితులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదని హితువు పలికారు. ప్రభుత్వం నేరస్తులకు రాజ్యాంగ రక్షణం కల్పిస్తే తాము పోరాటానికి సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు.

## మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, మార్చి 1, ప్రభాతవార్త :** మాజీఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హైదరాబాద్‌లో కలిసి పరామర్శించారు. చిలుముల మదన్ రెడ్డికి ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స జరిగింది. శస్త్ర చికిత్స అనంతరం మదన్‌రెడ్డి విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న హరీష్ రావు, సునీతారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మదన్ రెడ్డి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.



మదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న హరీష్ రావు, సునీతారెడ్డి